ఈ ప్రపంచంలో ఇప్పటికీ 180 కోట్ల మందికి నేరుగా నీటి వసతి లేదు. దాని కోసం వాళ్లు ఎంతో దూరం ప్రయాణించాలి. ఈ మాట విన్నప్పుడు 'అయ్యో పాపం' అనిపిస్తుంది. కానీ, ఈ మాటల్లో కనిపించని వేదన ఉంది. నీటి వసతి లేని ప్రతి పది ఇళ్లలోనూ ఏడు సందర్భాల్లో... నీళ్లు తెచ్చే బాధ్యత ఆ ఇంటి ఆడపిల్లలదే. ఇలా ప్రతిరోజూ నీళ్ల కోసం ఆడపిల్లలు 20 కోట్ల గంటలు శ్రమిస్తున్నారు. అది వాళ్ల చదువు, ఆరోగ్యం, ఆటపాటల మీద ప్రతికూలమైన ప్రభావం చూపిస్తోంది. అంతేనా! నీటి కోసం చేసే ప్రయాణాలలో లైంగిక వేధింపులు ఎదురవుతాయి. రజస్వల అయిన ఆడపిల్లలైతే, ఇంట్లో నీటి వసతి లేక, అపరిశుభ్రత వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. నీళ్లు లేకపోవడం కంటికి కనిపించే సమస్య. కానీ, దాని వల్ల ఆడపిల్లలు ఎక్కువ బాధపడతారు అన్నది గుండెపగిలే విశ్లేషణ.

నీరు మాత్రమే కాదు... ప్రతి సామాజిక సమస్యలోనూ సమాజం ఆడపిల్లలపైనే ఎక్కువ భారం మోపుతున్నది. ఆకలినే తీసుకోండి. ప్లాన్ ఇంటర్నేషనల్ అనే సంస్థ అంచనా ప్రకారం ఆకలితో బాధపడేవారిలో 70 శాతం మంది బాలికలు లేదా మహిళలే అని తేల్చింది. వైద్య పరీక్షల విషయంలో కూడా ఆడవాళ్ల కంటే మగవారి పట్లే మరింత జాగ్రత్తగా చికిత్స జరుగుతుందని కొవిడ్ సమయంలో వెలుబడిన కొన్ని పరిశోధనలు నిరూపించాయి. కాస్త జాగ్రత్తగా గమనిస్తే ఈ పరోక్ష లింగ వివక్ష అనేక రూపాలలో కనిపిస్తుంది.

### ఉద్యోగం పురుష లక్షణమేనా?

అంతర్జాతీయ కార్మిక సమాఖ్య గణాంకాల ప్రకారం కార్మిక రంగంలో పురుషుల్లో 72 శాతం మంది పని చేస్తుంటే, మహిళలు 28 శాతం మాత్రమే పనిలో ఉన్నారు. కొన్ని దేశాల్లో ఈ వ్యత్యాసం తీవ్రంగా ఉంది. ఎక్కడిదాకో ఎందుకు? మన దేశంలోనే 70 శాతం మగవారు ఉద్యోగాలు చేస్తుంటే, కేవలం 19 శాతం మహిళలే సంపాదనలో ఉన్నారు. ఉద్యోగ రంగంలో స్త్రీ-పురుషుల మధ్య వ్యత్యాసం తగ్గేందుకు కనీసం వందేండ్లు పడుతుందని గ్లోబల్ జెండర్ గ్యాప్ నివేదిక అంచనా. అదే ఎక్కువ అనుకుంటే కొవిడ్, ఆర్థికమాంద్యంలాంటి సందర్భాలు ఆ వివక్షను మరింత తీవ్రతరం చేశాయి. ఎందుకంటే ఉద్యోగాలకు ముప్పు ఏర్పడినప్పుడు ముందుగా ఊడేది మహిళల ఉద్యోగాలే. ఉదాహరణకు కొవిడ్ సమయంలో కోల్పోయిన ఉద్యోగాలలో 54 శాతం మహిళలవే కావడం గమనార్హం.

ఈ వివక్ష కేవలం చిన్న ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాదు. కార్పొరేట్ రంగంలోకి అడుగుపెట్టాక కానీ తెలియదు... అది పేరు మార్చుకున్న కురుక్షేత్రం. ఇక్కడ కూడా మహిళల పట్ల తీవ్రమైన వివక్ష ఉంది. ఇందులో మనందరికీ పరిచయం ఉన్న పదం మదర్ హుడ్ పెనాల్టీ. అంటే తల్లులుగా ఉన్నవారి ప్రతిభను తక్కువగా అంచనా వేయడం, మాతృత్వం తర్వాత నైపుణ్యానికి తగిన అవకాశాలు ఇవ్వకపోవడం... లాంటి ఆటంకాలు. అంతకుమించిన అడ్డంకులూ ఉన్నాయి. విచిత్రం ఏమిటంటే... ఇలాంటి పరిమితులన్నింటినీ దాటుకుని కార్పొరేట్ నిచ్చెనలో ఒక్కో మెట్టూ ఎక్కుతున్న కొద్దీ వేతన వ్యత్యాసం పెరుగుతూ ఉండటం. సాక్షాత్తు CFA సంస్థ చెబుతున్న మాట ఇది. మేనేజర్ స్థాయికి చేరుకున్న మహిళలు తోటి పురుషుల జీతంలో సగం మాత్రమే అందుకుంటున్నారని



ఈ నివేదిక చెబుతున్నది. ఇక మహిళలు కంపెనీ అధ్యక్ష పదవికి (సీఈఓ) చేరుకోవడం అంటే దాదాపుగా అసాధ్యం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సీఈఓ పదవులలో మహిళల వాటా కేవలం 5.5 శాతమేనని ఓ అధ్యయనం చెబుతున్నది. ఇంటి పని చేసుకుంటూ, ఆఫీస్ రాజకీయాలు ఎదుర్కొంటూ, నైపుణ్యాన్ని నిరూపించుకుంటూ, పిల్లలను గమనించుకుంటూ... ఉద్యోగాల్లో రాణిస్తున్న మహిళలకు సమాన పనికి సమాన వేతనం దక్కట్లేదు.

### మనసులోనే బీజం!

ఎన్ని మాటలు చెప్పుకున్నా మనది పితృస్వామ్య దృక్పథమే. 'వాడు మగవాడు' లాంటి మాటలు, 'ఆడపిల్లలా ఏడుపేంటి?' తరహా ఎత్తిపొడుపులు, 'అరిటాకు ముల్లు' సామెతలు... మన మెదడును చిన్నప్పటి నుంచే మలుస్తూ ఉంటాయి. మహిళలు వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి సీఈఓ అయినా కూడా 'నా ఇంటి బాధ్యతను కూడా బ్యాలెన్స్ చేసుకుంటూ ఉంటాను' అని సంజాయిషీ ఇవ్వాల్సిన పరిస్థితి. 'మగపిల్లలు ఎలా ఉండాలి, ఏం చేయాలి... ఆడపిల్లలు ఎంత అణకువగా, బాధ్యతగా ఉండాలి' అని మన మెదడులో ఏదో ఒక మూలన నిశ్చితమైన అభిప్రాయాలు ఏదో ఒక సందర్భంలో వ్యక్తమవుతాయని పరిశోధనలు నిరూపించాయి.

**శ్రీ తర్వాతే మతి:** ఒక జంట గురించి చెప్పుకునేటప్పుడు ముందుగా భర్త పేరే ఎంచుతాం. మిస్టర్ అండ్ మిసెస్ సురేష్ లాగా! ఇది సహజంగానో, సంప్రదాయంగానో కనిపించవచ్చు. కానీ, దీని వెనుక కనిపించని వివక్ష ఉందని డాక్టర్ హెగార్టీ పరిశోధన నిరూపించింది. ఆయన కొంతమంది అభ్యర్థుల ముందు భార్యాభర్తల పేర్ల జాబితాను ఉంచాడు. వీరిలో భార్య పేరు ముందున్నప్పుడు ఆ జంట ఆధునికమైందనే అభిప్రాయం కలిగిందట. అలాగే కొన్ని జంటల పేర్లను సూచించి వారి లక్షణాలను ఊహించమన్నప్పుడు... భార్య పేరు ముందున్న జంటలలో స్త్రీలదే ఆధిపత్యం అనే ఊహ స్పష్టంగా మెదిలింది. ఏతావాతా భర్త నీడలోనే భార్య అనే భావన వ్యక్తమైంది.

### వస్తువుగానే చూస్తున్నాం

'ఆడదంటే ఆటబొమ్మ కాదు' అని ఆవేశంగా చెబుతాం సరే. మరి మన మెదడు ఏమనుకుంటున్నది? ఇదే అనుమానం బెల్జియం పరిశోధకుడు ఫిలిప్ బెర్నార్డ్‌కి వచ్చింది. ఆయన కొందరి మెదడు తీరును గమనించారు. మన మెదడు వస్తువులను ఒకలా, మనుషుల్ని ఒకలా పసిగడుతుంది. వస్తువుల్ని అందులో భాగాలను బట్టి కూడా గుర్తుపడుతుంది (ఉదాహరణకు కుక్కర్ మూత), అలాగే వస్తువును తిరగేసినా పసిగడుతుంది (ఉదా: కంప్యూటర్). కానీ మనిషిని మాత్రం ఒక కన్నును చూసో, తిరగేసిన తన ఫొటోను చూసో గుర్తుపట్టడం చాలాచాలా కష్టం. ఈ సూత్రం ఆధారంగా ఫిలిప్ కొన్ని వస్తువుల ఫొటోలు, మగవారి ఫొటోలు, ఆడవారి ఫొటోలు చూపించినప్పుడు... వస్తువులనూ, తెలిసిన ఆడవారి ఫొటోలనూ తిరగేసినా కూడా గుర్తుపట్టారట. దానర్థం!

### ఏం చేసినా తప్పే

స్త్రీకి సంకెళ్లు వేసి... తనను స్వేచ్ఛగా ఉండమని ప్రోత్సహించే సమాజం మనది. ఈ ద్వంద్వ ప్రవృత్తిని నిరూపించే ప్రయత్నం ఒకటి జరిగింది. యూనివర్సిటీ ఆఫ్ ఎగ్జిటర్‌లో జరిగిన ఓ పరిశోధనలో ప్రసూతి సెలవుల గురించి అభిప్రాయాలు సేకరించారు. ఇందులో భాగంగా కొంతమంది మహిళలు ప్రసూతి సెలవులను పూర్తిగా వినియోగించుకున్నారనీ, ఇంకొందరు సెలవులు పూర్తి కాకుండానే ఉద్యోగంలో చేరిపోయారని చెప్పారు. విచిత్రం ఏమిటంటే ఈ రెండు సందర్భాల్లోనూ ప్రతికూలమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రసూతి సెలవు తీసుకుంటే ఉద్యోగానికి తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనీ, సెలవు పూర్తికాకుండానే ఉద్యోగంలో చేరితే పిల్లలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనీ... శ్రోతలకు తోచింది.



## ఈవ్ టీజింగ్ కూడా వివక్షే!

తొలి టాకీ సినిమా వచ్చి దాదాపు వందేండ్లు గడుస్తున్నది. క్రమక్రమంగా సినిమా కథల్లో, కథనాలలో చాలా మార్పులు వచ్చాయి. కానీ ఒక్కటి మాత్రం మారలేదు. హీరోయిన్ వెంటపడి హీరో వేధించడం. మొదట్లో హీరోను అసహ్యించుకునే నాయిక... కొన్ని రీళ్ల తర్వాత తననే ప్రేమించడం. మన సమాజంలో చాలా తీవ్రంగా పరిగణించే ఈవ్ టీజింగ్, స్టాకింగ్, యాసిడ్ దాడులు లాంటి మనస్తత్వాలకు ఇది ప్రతీకని గుర్తించకపోవడం బాధకరమే. ఇందుకు స్పష్టమైన కారణం ఉంది. అసలైన మగవాడు ఎవరూ అంటే సమాజంలో కొన్ని కచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయని ఇండియానా విశ్వవిద్యాలయంలో పరిశోధకులు గమనించారు. కఠినత్వం, బలం, తెగింపు, కొట్లాట, ఆడవారితో తిరగడం, భాగస్వామి మీద ఆధిపత్యం... లాంటి లక్షణాలు వీటిలో కొన్ని. ఐపీసీ 294, 292, 509, 354 లాంటి ఎన్నో సెక్షన్ల ద్వారా వేధింపులకు శిక్ష విధిస్తున్నప్పటికీ ఈ సంఘటనలు తగ్గడం లేదు సరికదా మరింత విస్తృత, వికృత రూపం ధరిస్తున్నాయి.